

విశాలాంధ్ర విశాఖపట్నం

పేజి నెం. 5

మంగళవారం 12, నవంబర్, 2024

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా. సి.హెచ్.విష్ణు మూర్తి అధ్యక్షతన ఎంఎస్‌ఎస్ పీఓ డి.ప్రవీణ జాతీయ విద్యా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. డా. సి.హెచ్ విష్ణుమూర్తి మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ భారత ప్రథమ విద్యాశాఖా మంత్రిగా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు బి.ప్రసాద్, ఆంగ్ల అధ్యాపకులు డి.మాధురి, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం హామీలలో భాగంగా పట్టణంలో 2 సెంట్లు, గ్రామంలో 3 సెంట్లు పేదలకు ఇస్తామన్న మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సీపీఐ గాజువాక నియోజకవర్గం కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. సోమవారం గంగవరం, జాలారిపాలెం ముఖ్య కార్యకర్తల సమావేశం వై.నందన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 2014లో టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. టిడ్కో లబ్ధిదారులకు గృహాలు అందక ఎదురుచూపులు చూస్తున్నారని పూర్తయిన టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు అందించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణం కోసం 4 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పిందని, కనీసం 5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ నెల 18న సచివాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి పల్లేటి పోలయ్య, కెంగువ అచ్యుతరావు, పి.పోతన్న, మాధవరావు, సోమేశ్, నూకాలు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

చలో కలెక్టరేట్‌ను అడ్డుకున్న పోలీసులు పడాల రమణ సహా పలువురు అరెస్టు టూ టౌన్‌కు తరలింపు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరుతున్న కార్మి కులను, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణతోపాటు జిల్లా అధ్యక్షులు కోటా సత్తిబాబు, నాయకులు ఎం.మదన్ మోహన్, బి.ప్రతాప్, కూన కృష్ణారావు, ఎస్.సూర్యనారాయణ, కె.ఈశ్వరరావు, ఎం.యోగి, దాలి బాబు, రామకృష్ణ, రమనేశ్వరి, ఆర్.సత్తిరాజు, బోర రమణ, ఆర్.కృష్ణ, సూరిబాబు తదితరులును అరెస్ట్ చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భవన్ నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి పెనంపై నుండి పొయ్యిలో పడిన చందగా ఉందన్నారు. గత జగన్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996 అడ్డం పెట్టుకొని వెల్ఫేర్ బోర్డు పేరుతో నిర్మాణ యాజమానులు, ప్రభుత్వ సంస్థలు నుండి కోట్ల రూపాయలు వసూలు చేసుకున్న జగన్ సొంత ప్రయోజనాలకు వాడుకున్నారు తప్ప కార్మికులకు ఒక రూపాయి కూడా ఆర్థిక సహాయం చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం గెలిస్తే ఇసుక పాలసీని మారుస్తామని, అందరికీ ఇసుక ఉచితంగా ఇస్తామని సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి భవన నిర్మాణ కార్మికుల ఆదుకుంటామని చెప్పిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సంతకం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఫైల్ మీద పెడతామని చెప్పిన నేతలు అధికారంలోకి రాగానే అవన్నీ మరిచిపోయి నెలలు గడుస్తున్నా 50 లక్షల మంది కార్మిక ప్రయోజనాల కోసం ఏర్పడిన సంక్షేమ బోర్డు నిధులు, విధులు, వినియోగంపై చర్చించి చర్యలు తీసుకోకపోవడం అత్యంత దుర్మార్గం అని రమణ మండిపడ్డారు. కొత్త ఇసుక పాలసీని పెట్టి అందరికీ ఇసుక ఉచితమే అంటూ ప్రకటించి, ఆచరణలో ఇసుక ఉచితంగా రావడం లేదన్నారు. కొంతమంది దళారీలు ఇసుక బ్లాక్ చేసి అధిక ధరలకు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వమే అన్ని నగరాలలో స్టాక్ పాయింట్ల ద్వారా ఇసుక సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్లైంలు ఇవ్వాలని, పెరిగిన స్టీల్, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేలం శివ, కోటాన ఆనంద్, ఎన్.మధు, వెంకట్ పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 59వ వార్డు పరిధి హిమాచల్ నగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్థానిక వార్డు టీడీపీ నాయకులు ఐక్యత యూత్ సభ్యులు సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది. ఒక్క రోజులోనే 1000కి పైగా సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి శంకర్, టీడీపీ సీనియర్ నాయకులు పూడి విజయభాస్కర్, దేవర ఈశ్వరరావు, బీజేపీ నాయకులు సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని తర్లువాడ గ్రామపంచాయతీ ప్రకృతివాని పాలెంలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ బిఆర్‌బి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తాట్రాజు అప్పారావు, వార్డు మెంబర్ అక్రమాని ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలన్నీ కిటకిట

విశాలాంధ్ర - సింహాచలం: కార్తీక మాసం రెండవ సోమవారం కావడంతో శైవక్షేత్రాలు 89, 92, 93, 98 వార్డుల్లో కిటకిటలాడుతున్నాయి. కార్తీక మాసానికి ఒక విశిష్టత ఉంది. సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఉండి శైవ క్షేత్రాలు దర్శించుకుంటే శు భమని అందరూ భావిస్తారు. భక్తులు ఇబ్బంది పడకుండా శివాలయాల్లో అన్ని చర్యలు తీసుకుంటున్నారు. కార్తీక మాసంలోని సోమవారం నాడు శివాలయంలో ఎక్కువ మంది ఉపవాస దీక్షలు ఉండటం సంప్రదాయంగా వస్తుంది. అత్యంత భక్తి శ్రద్ధలతో శివునికి ప్రత్యేక పూజలు చేశారు.

72వ వార్డు కణితి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించండి

సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గాజువాక ప్రాంతం పరిధి 72వ వార్డులో పలు అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని ఆ వార్డు కార్పొరేటర్, సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు, మేయర్ హరి వెంకట కుమారికి వినతి పత్రం అందజేశారు. కణితి ప్రధాన రహదారి నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు నుండి ఏడు కోట్లు మంజూరు అయిందని, కాలువలు, రోడ్ల నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను స్టాలిన్ కోరారు. విద్యానగర్ కాలనీ అప్రోచ్ రోడ్డు జాతీయ రహదారికి అనుకుని ఉన్న నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఆ కాలనీ అసోసియేషన్ నేతలతో కలిసి కమిషనర్‌కు తెలియ జేశారు. చినగంట్యాడ ఎస్సీ కాలనీ రహదారి నిర్మాణం కూడా వెంటనే ప్రారంభించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. కమిషనర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను పిలిపించి వెంటనే ఈ పనులు పురోగతిని తనకు తెలియ జేయా లని వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో విద్యానగర్ కాలనీ అసోసియేషన్ నేతలు బి.సత్యనారాయణ, ఏ.వెంకటేష్‌రావు, ఎంఎస్‌ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం అన్యాయం

అక్కయ్యపాలెం జెసిఎల్ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ నిరసన

విశాలాంధ్ర - విశాఖ: ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత ఇసుక పాలసీ మారుస్తామని, అందరికీ ఉచితంగా ఇసుక ఇస్తామని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి భవన నిర్మాణ కార్మికులని ఆదుకుంటామన్న హామీ ఏమైందని సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎం.పైడిరాజు, జీఎస్‌జె అచ్యుతరావులు ప్రశ్నించారు. అక్కయ్యపాలెం జెసిఎల్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన నిరసనలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల ప్రయోజనం కోసం ఏర్పడిన సంక్షేమ బోర్డు నిధులు వినియోగంపై చర్చించి, చర్యలు తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. కొత్త ఇసుక పాలసీని ప్రవేశపెట్టి, అందరికీ ఇసుక ఉచితమేనని ప్రకటించారని ఆచరణలో ఇసుక ఉచితంగా రావడం లేదన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. జీఓ నెంబరు 66ను రద్దు చేయాలని, అలా చేయకపోతే కూటమి ఇసుక పాలసీ లక్ష్యం నిర్వీర్యం అవుతుందని అన్నారు. ఇసుక మాఫియాను అరికట్టాలని, ఇచ్చిన మాట ప్రకారం ఇసుకను ఉచితంగా సరఫరా చేసి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు, నిర్మాణ రంగంపై ఆధారపడిన భవన నిర్మాణ కార్మికులకు మేలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా లేబర్ కమిషనర్ కార్యాలయంలో పర్యవేక్షణ అధికారి రవికుమార్‌కి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఆర్.శ్రీని వాసరావు, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎం.మన్మధరావు, ఎస్‌కె రెహమాన్, జి.రాంబాబు, జెడి నాయుడు, ఎంఏ బేగం, ఎన్.నాగభూషణరావు, ఎన్.ఆసిరి నాయుడు, ఎం.రాము, ఏ.రమణ, ఏ.అన్నపూర్ణ, ఎన్.అన్నపూర్ణ, కె.వనజాక్షి, బి.పుష్పలత, ఏ.దేముడమ్మ, కె.లక్ష్మణరావు, సీహెచ్ కాసుబాబు, వి.నల్లయ్య, ఏ.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం ప్రచారం

విశాలాంధ్ర - తగరపువలస: సీపీఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రచార కార్యక్రమం నాలుగో రోజు కొనసాగింది. మెయిన్ రోడ్డు రాజు వీధి మీదుగా కరపత్రాలు పంపిణీ చేస్తూ భీమిలి సీపీఎం పార్టీ జోన్ కమిటీ నాయకులు రవ్వ నర్సింగ్‌రావు, ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపాలని, తగరపువలసలో జూనియర్ కాలేజీ నిర్మించాలని, ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించాలని, మంచినీటి ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించాలని, తగరపువలస మెయిన్ రోడ్ భీమిలి రోడ్డు వెడల్పు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీర సత్యారావు, నర్సింగరావు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. పదే పదే వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటి పరిష్కారంలో ప్రజలతో జిల్లా స్థాయి అధికారులే నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. వారు చెప్పిన సమస్యలను సావధానంగా విన్నారు. ఈ క్రమంలో గత వారం వచ్చిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్షించిన ఆయన వివిధ అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, కౌంటర్ దాఖలు చేయాల్సిన అంశాల్లో తక్షణమే స్పందించాలని, తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.

వివిధ సమస్యలపై పీజీఆర్‌ఎస్‌కు 301 వినతులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 301 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 113, జీవీఎంసీకి చెందినవి 59, పోలీసు శాఖకు సంబంధించి 17, ఇతర శాఖలకు సంబంధించి 112 ఉన్నాయి. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ, ఇతర విభాగాల ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం

విశాలాంధ్ర - మధురవాడ: బాలలలో శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంచడానికి, నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి జవహర్ నవోదయ విద్యాలయ సమితి(జెఎన్‌వి) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ -2024 సోమవారం ఘనంగా ప్రార ంభమైంది. దక్షిణ భారత దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ ఈ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు హాజర య్యారు. బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన గీతం ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ నైపుణ్యంతో కూడిన, బాధ్యత తెలిసిన భావితరాల కోసం దేశం ఎదురు చూస్తుంన్నారు. విజ్ఞానానికి పరిధులు లేవని సైన్స్ సహ అన్ని శాస్త్రాలు మనిషి ఎదగడానికి ముఖ్యమైనవన్నారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రముఖ భూభౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమీషనర్ డాక్టర్ ఇ.ఉమాపతి రెడ్డి, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, జవహర్ నవోదయ విద్యాలయ సమితి విశాఖ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై ఆక్రమణదారుల దాడి.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో రామవరం పంచాయతీ జీవీఎస్ అగ్రహారంలో సర్వేనెంబర్ 1లో నలుగురు వ్యక్తులు సుమారుగా 12 సెంట్లు గ్రామ కంఠంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి అక్రమంగా నిర్మించిన వాటిని జెసిబితో తొలగించే క్రమంలో నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ వరహాలుపై ఇష్టానుసారంగా దాడికి దిగారు. రెవెన్యూ అధికారులపై అసభ్య పదజాలంతో దూషణలకు దిగారు. అలాగే జెసిబి వాహనాన్ని నాశనం చేస్తామని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో గొల్లవిల్ల గోవింద్ తండ్రి నాయుడు, గంద్రెటీ వాసు తండ్రి ఈశ్వరరావు, అక్కిరెడ్డి ఎర్రి నాయుడు తండ్రి నాయుడు, అమరపల్లి నరేష్ తండ్రి రమణలపై స్థానిక పోలీస్ స్టేషన్లో రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ పేర్లి శ్యాం ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమించుకున్నట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులపై దాడి చేయడం చాలా దారుణమని తీవ్రంగా ఖండిస్తూ అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

68వ వార్డులో ప్రధాన కాలువ అడ్డంకులపై చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ 6వ జోన్ 68వ వార్డు పరిధిలో గల షీలా నగర్, పెట్రోల్ బంక్ సమీపాన ప్రధాన కాలువ అడ్డంకులపై చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ, గెయిల్ అధికారులతో కలిసి ఆ ప్రధాన కాలువకు అడ్డంకులు కలిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ ముందుగా మాట్లాడుతూ షీలా నగర్, పెట్రోల్ బంక్ సమీపాన పారుతున్న ప్రధాన కాలువకు ఏర్పడిన అడ్డంకులపై ఆరా తీశారు. ఈ విషయమై ప్రధాన వైద్యాధికారి డాక్టర్.నరేష్ కుమార్ మాట్లాడుతూ కాలువ మేఘాద్రి గెడ్డ నుండి నరవ మీదుగా పారుతుందని, 20 అడుగుల వెడల్పు గల ఈ ప్రధాన కాలువ గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) రక్షణ గోడకు అనుకొని వెళ్తుందని, ఒక సంవత్సరం కాలం నుండి గెయిల్ యాజమాన్యం ఆ కాలువను మూసివేసినందున కాలువ సాఫీగా పారేందుకు అడ్డంకులు ఏర్పడ్డాయని, తద్వారా 20 అడుగుల వెడల్పు గల కాలువ ఆరడుగుల వెడల్పుతో మరొక మార్గంలో నివాసితుల మధ్యలో కాలువ నీరు పారుతున్నందున సమీప నివాసాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అంతేకాకుండా భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు ఒక చెరువు మాదిరిగా ఆ ప్రాంతమంతా మురుగునీరుతో జలమయమవుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్ గెయిల్ ప్రతినిధి మూర్తితో మాట్లాడుతూ ఒక సంవత్సరం కాలం నుండి ఈ ప్రధాన కాలువకు అడ్డంకి ఏర్పడడం వలన ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, కాలువ మూసివేసినం దుకు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కాలువలో నీరు పారకుండా మూసివేతకు సంబధిత కారణాలను పూర్తి సమాచారంతో వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 6వ జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, పర్యవేక్షక ఇంజనీర్ గోవిందరావు, గెయిల్ ప్రతినిధి మూర్తి, సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్

విశాలాంధ్ర - విశాఖ : ముఖ్యమంత్రి చంద్రబాబును వీఎంఆర్డీఏ కొత్త ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ మర్యాద పూర్వకంగా కలిసారు. తనకు వీఎంఆర్డీఏ ఛైర్మన్ గా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనునిత్యం ప్రజల కోసం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని ఆయన తెలిపారు. తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి జీవితాంతం రుణపడి ఉంటానని ప్రణవ్ గోపాల్ అన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని, విశాఖ అభివృద్ధిని కృషి చేస్తానని చెప్పారు. పదవిని బాధ్యతగా భావించి ప్రజలకు సేవ చేయాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన వీఎంఆర్డీఏ పరిధిలోని ఎంపీలు, ఎంఎల్‌ఏలతో పాటు కూటమి నేతలు, కార్యకర్తలు, టి.ఎన్.ఎస్.ఎఫ్. నాయకులు, శ్రేయోభిలాషులను కృతజ్ఞతలు తెలిపారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థ

విశాలాంధ్ర - విశాఖపట్నం: దేశ యువతను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మలచడమే నూతన విద్యా విధానం లక్ష్యమని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు "ఈక్విటీ డైవర్సిటీ అండ్ ఇంక్లూషన్ ఇన్ ఎన్‌ఈపి 2020 ఇష్యూస్, కన్సర్న్స్ అండ్ ఛాలెంజర్స్"ను ఆయన ప్రారంభించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, న్యూఢిల్లీ సహకారంతో సదస్సును ఏర్పాటు చేశారు. ముందుగా భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం సదస్సును ఉద్దేశించి మాట్లా డుతూ విద్యార్థి కేంద్రంగా నూతన విద్యా విధానం ఏర్పాటు అయిందని చెప్పారు. ఎక్కువ శాతం మంది యువత ఉన్నత విద్యలో ప్రవేశించడం దీని లక్ష్యమని చెప్పారు. విశిష్ట అతిథి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ సమాజాభివృద్ధికి, సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే కీలకమని అన్నారు. జ్ఞానమే నేడు నిజమైన సంపదగా నిలుస్తోందని, ఇటువంటి జ్ఞానాన్ని సృష్టించే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. కార్యక్రమంలో మను కేంద్రీయ విశ్వవిద్యాలయం సాటిలైట్ క్యాంపస్(బీహార్) విద్యా విభాగం ఆచార్యులు పి.ఎడం పాల్ పాటేటీ, విద్యావిభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు, ఐఏఎస్‌ఈ ప్రిన్సిపల్ ఆచార్య డి.నాగరాజా కుమారి తదితరులు ప్రసం గించారు. సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

ఇసుక తవ్వకాలు, స్టాక్ యార్డులు ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వరాదు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఇసుక తవ్వకాలను, స్టాక్ యార్డులను ప్రైవేటు ఏజెన్సీలకి ఇవ్వడం అన్యాయమని, ప్రభుత్వమే ఇసుక రీచులను నిర్వహించాలని, ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం (ఏఐటీయూసీ) నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు కెంగువ అచ్యుత్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం కొత్త గాజువాక లేబర్ పాయింట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని, రాష్ట్రంలో 25 లక్షల పైగా కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్నారని, గత అనేక సంవత్సరాలుగా రాష్ట్రంలో బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా వచ్చిన నిధులను ఉపాధి పొందే కార్మికులకు చెందకుండా ప్రమాదంలో చనిపోయిన క్లైములకు పెండింగ్లో ఉంచి వారికి ఇవ్వవలసిన నష్టపరిహారాన్ని ఇంతవరకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. భవనిర్మాణ కార్మికులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. తాపీ మేస్త్రిలకు 10000 రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందిపూడి దుర్గారావు, పిల్లా. ఈశ్వరరావు, పిల్లా శ్రీను, రమణ, రాజు, కె.వనజాక్షి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ మార్గదర్శకులు

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భావితరాలకు మౌలానా అబుల్ కలాం ఆజాత్ గొప్ప మార్గదర్శకులని, ఆయన విద్యారంగానికి చేసిన కృషి వల్లనే భారతదేశం అమెరికా, చైనా కంటే ముందంజలో ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. విద్యా పరంగా భారతీయులు అత్యున్నత స్థానాలు అధిరోహించారని, అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారని గుర్తు చేశారు. దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి, అసమాన విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ వీసీ హాలులో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆజాద్ జీవిత విశేషాలను వెల్లడించారు. దేశ విద్యా రంగానికి ఆయన ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే భారతీయులు విద్యాపరమైన అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారని గుర్తు చేశారు. ప్లేటో, అరిస్టాటిల్ వంటి మహనీయుల మాదిరిగా గొప్ప తాత్వికవేత్త అని కితాబిచ్చారు. హిందూ-ముస్లింల మధ్య సోదర భావాన్ని పెంపొందించటంలో, స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన కృషి ఏనలేనదని పేర్కొన్నారు. గాంధీజి పిలుపు మేరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించారని గుర్తు చేశారు. నేటి తరం యువత అబుల్ కలాం ఆజాద్ బాటలో నడవాలని, శ్రద్ధాశక్తులతో కృషి చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

ముస్లింల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా ముస్లిం పెద్దలు కొన్ని సమస్యలను కలెక్టర్ వద్ద ప్రస్తావించగా ఆయన సానుకూలంగా స్పందించారు. వక్ఫ్ బోర్డు భూములు, శ్మశాన భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని కార్పొరేటర్ చెప్పగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి జ్యోతి మాధవి, మోహమ్మద్ సాధిక్, బరకత్ అలీ, మెహమ్మద్ ఇమ్రాన్, అబ్దుల్ హనీఫ్, రెహ్మాన్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆల్ హెల్ప్ లైన్ నంబర్ల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆపద కాలంలో, అత్యవసర సమయంలో అందరికీ ఉపయోగపడే విధంగా ఉన్న వివిధ డిపార్ట్మెంట్లకు చెందిన హెల్ప్ లైన్ల నంబర్లతో కూడిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన సంబంధిత గోడపత్రికను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ, ఐసీడీఎస్ పీడీ జయదేవి, ఇతర అధికారులతో కలిసి సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆవిష్కరించారు. వీటి ఆవశ్యకతను అందరూ తెలుసుకోవాలని, అందరికీ తెలియజేయాలని, విస్తృత ప్రచారం కల్పించాలని అన్ని శాఖల అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

ఉచిత అత్యవసర హెల్ప్ లైన్ నంబర్లు

- చైల్డ్ హెల్ప్ లైన్ : 1098, ఉమెన్ హెల్ప్ లైన్ : 181, పోలీస్ హెల్ప్ లైన్ : 100, జాతీయ అత్యవసర హెల్ప్ లైన్ : 112, అత్యవసర వైద్య సేవ హెల్ప్ లైన్ : 108, వైద్య సహాయ హెల్ప్ లైన్ : 104, సైబర్ నేరాలు హెల్ప్ లైన్ : 1930, ఫైర్ హెల్ప్ లైన్ : 101, ఎల్పీజీ గ్యాస్ లీక్ హెల్ప్ లైన్ : 1906, రోడ్డు ప్రమాదాల హెల్ప్ లైన్ : 1073.

కరాటే కాంపిటీషన్లో కేథరిన్ విద్యార్థికి బంగారు, రజత పతకాలు

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలస స్థానిక కేథరిన్ స్కూల్‌కు చెందిన లింగపల్లి లోహిత్ పాత్రుడు విశాఖపట్నంలో జరిగిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ 2024 పోటీల్లో బంగారం, రజతం పతకాలు సాధించాడు. ప్రముఖ హీరో సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా మెడల్స్ బహుకరించారు. ఈ విషయంపై లింగపల్లి లోహిత్ పాత్రుడు మేనమామ విశాఖ పార్లమెంటరీ యూత్ సెక్రెటరీ మరియు విశాఖ జిల్లా నగరాల సంఘం సభ్యులు పిల్ల రాజేష్ కేథరిన్ స్కూల్ యాజమాన్యాన్ని మేనల్లుడు లోహిత్ పాత్రుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న కాలంలో రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో మెడల్స్ తీసుకురావాలని, ఊరికి కుటుంబానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

కాశీ విశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కార్తీక మాసం రెండువ సోమవారం సందర్భంగా పెద గంట్యాడ నెల్లి ముక్కు రామాలయం

ప్రక్కన ఉన్న శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కాశీ విశ్వేశ్వర స్వామి వార్ల పూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త ముద్దుర్తి శ్రీ రామ మూర్తి,ద్వారపూడి గురునాథ్ రావు, కణితి అప్పల రాజు, ముద్దుర్థి సాంబ,రాము, శ్రీను,పిట్ట కుంచారావ్, యంపడ అప్పల రెడ్డి,పులి రాము ముద్దుర్తి మణి, చంటి,కొమ్మోజూ హరి కృష్ణ, మహేష్, పూడి హరీష, పెద పాటి స్వామి, కానూరు నరేష్ తధితర్లు పాల్గొన్నారు.

కేఎఫ్సీతో విజయ్ దేవరకొండ థ్రిల్ ఫీస్ట్

విశాలాంధ్ర- విశాఖపట్నం: యాక్షన్ స్టార్ విజయ్ దేవరకొండ, వి డి 12 నటుడు భారతదేశంలోని అత్యంత ఎపిక్ కె ఎఫ్ సి లో తనకు ఇష్టమైన క్రిస్పీ చికెన్‌ను టేస్ట్ చేస్తూ కనిపించాడు. తన రాబోయే చిత్రం కోసం అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్‌తో కలిసి పనిచేస్తున్న నటుడు, తన తాజా ఎపిక్ ఫుడ్ అడ్వెంచర్ నుండి ఇన్‌స్టాగ్రామ్‌లో వరుస చిత్రాలను పంచుకున్నాడు. విజయ్ ఐకానిక్ హాట్ %eకీ% క్రిస్పీ చికెన్ బకెట్ మరియు క్లాసిక్ అమెరికన్ జింగర్‌తో సహా కేఎఫ్ సీ మెను నుండి తనకు ఇష్టమైన వాటిని ఆస్వాదిస్తూ కనిపించారు.

క్రియేటర్ సెంట్రల్‌ను ప్రారంభించిన అమెజాన్ డాట్ ఇన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో క్రియేటర్ సెంట్రల్‌ను ప్రారంభించినట్లు అమెజాన్ డాట్ ఇన్ ప్రకటించింది. ఇది కంటెంట్ క్రియేటర్లను శక్తివంతం చేయడానికి రూపొందించ బడిన ఒక సమగ్ర వేదిక. కంటెంట్ సృష్టి ప్రక్రియను క్రియేటర్ సెంట్రల్ క్రమబద్ధీకరిస్తుంది, సాంకేతిక సంక్లిష్టతలపై కాకుండా క్రియేటర్లు తమ సృజనాత్మకతపై దృష్టి పెట్టేందుకు వీలుగా సులభంగా తెలుసుకునే వర్క్‌ఫ్లోలు మరియు అంకితమైన స్టోర్‌ను అందజేస్తుంది. క్రియేటర్ సెంట్రల్‌తో, కంటెంట్ క్రియేటర్‌లు అమెజాన్.ఇన్‌లో తమ కంటెంట్‌ను సులభంగా ఉత్పత్తి చేయవచ్చు మరియు ప్రచారం చేయవచ్చు. లక్షలాది మంది షాపర్‌లను చేరుకోవచ్చు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) సదస్సులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో పలాస, విశాఖపట్నం జోన్-2, రంపచోడవరం, జంగారెడ్డిగూడెం డివిజన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్‌లో సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) ఛైర్ పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలాస డివిజన్ (ఇచ్ఛాపురం సెక్షన్, తేది 13.11.2024), విశాఖపట్నం జోన్-2 డివిజన్ (మల్కాపురం సబ్ డివిజన్, తేది 19.11.2024), రంపచోడవరం డివిజన్ (అడ్డతీగల సెక్షన్, తేది 28.11.2024), జంగారెడ్డిగూడెం డివిజన్ (కొయ్యలగూడెం సబ్ డివిజన్, తేది 29.11.2024) కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే సదస్సుల్లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చు తగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను ఛైర్ పర్సన్, సిజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగ దారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ఈ సదస్సుల్లో ఛైర్ పర్సన్ బి.సత్యనారాయణతోపాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.మసిలమణి, షేక్ బాబర్ పాల్గొననున్నారు.

జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం గ్రామంలో శ్రీ నారాయణేశ్వర స్వామి శివాలయంలో జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 300 మంది భక్తులకు పులిహోర, పొంగల్ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఇమంది శ్రీనివాసరావు, ఫౌండేషన్ కోశాధికారి కుప్ప రామలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు మెరుగు రాము, శ్రీను పాల్గొన్నారు.

శివ భక్తిని చాటుకున్న ఎన్ఆర్ఐ దొరబాబు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ కురపల్లి గ్రామంలో నిర్మించినటువంటి పురాతన దేవాలయం శ్రీ రామచంద్ర రామలింగేశ్వర స్వామి ఆలయానికి రేవిడి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఠాగూర్ దొరబాబు పరమశివునిపై తన భక్తిని చాటుకున్నారు. శివాలయంలోని శివలింగానికి పానుమట్టం ను భక్తి కానుకగా సమర్పించారు. వేకువజామునే భక్తిశ్రద్ధలతో పూజలు చేయించి శివలింగానికి పానుమట్టం అలంకరించారు. దొరబాబు ప్రతి ఏదాది ఏదో ఒక దేవాలయానికి తన వంతు భక్తి కానుకులను సమర్పించి తనలో ఉన్న ఆధ్యాత్మిక భక్తి భావాన్ని తెలియజేస్తుంటారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, స్థానిక గ్రామస్తులతో పాటు కార్తీక సోమవారం ఆలయానికి వచ్చిన భక్తులు పాలుపంచుకున్నారు.

ఓఎస్‌జి ఫౌండేషన్ అధినేత శివ దళాయికి ఘనసత్కారం

విశాలాంధ్ర - ఆనందపురం: వందే భారత్ బ్లడ్ సోల్స్ ఆఫ్ హ్యుమానిటీ సంయుక్తంగా నిర్వహించిన 1000వ క్యాంప్ దిగ్విజయంగా పూర్తి చేసినందున సహకారంచిన ప్రతి ఒక్క స్వచ్ఛంధ సంస్థను సత్కరించారు. గాజువాకలో బీసీ రోడ్ వద్ద ఆత్మీయ కలయిక సత్కారం భీమిలీ నియోజకవర్గం ఆనందపురం మండలం గంభీరం పంచాయితీ నందు కరోనా సమయం నుండి ఇప్పటి వరకు రక్తదాన శిబిరాలు, ఉచిత విద్య శిబిరాలు, రోడ్డు మీద యాచాకులకు ఆహారం, చికత్స నిమిత్తం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి సహాయం చేస్తున్న ఓఎస్‌జి ఫౌండేషన్ శివ దళాయిని వందే భరత్ బ్లడ్ సెంటర్ వినోద్ బాలు ఘనంగా సత్కరించారు.

చెరువు నీటి కాలుష్య నివారణ చర్యలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలోని జగన్నాధపురం గ్రామంలో చెరువు నీరు కాలుష్యంతో ఏర్పడిన రుగ్మతలపై ప్రచురించిన విశాలాంధ్ర కథనానికి అధికారులు స్పందించారు. ఈ గ్రామానికి సమీపంలో ఉన్న పందలపాక బెటాలియన్ క్వార్టర్స్ సిబ్బంది వినియోగించే ఆహార వ్యర్థాలను చెరువులో వేయడం వల్ల నీరు కలుషితం అవ్వడమే కాకుండా దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు వివరించారు. అంతేకాకుండా పశువులు కూడా రోగాలు బారిన పడుతున్నట్లు స్థానికులు తెలిపిన సమాచారం పై వార్త ప్రచురించడంతో అధికారులు స్పందించి తగిన చర్యలు చేపడుతున్నారు. దీంతో స్థానికులు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు తగదు

విశాలాంధ్ర - పద్మనాభం: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కరిపై సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో రెచ్చిపోయిన సోషల్ మీడియా వ్యక్తులపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవడం చాలా మంచి పరిణామం అని విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి మజ్జి శ్రీను తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలకు పాల్పడిన వ్యక్తులపై పార్టీలకు అతీతంగా చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని అది ఎవరైనా సరే ఇలాంటి విష సంస్కృతిని నాశనం చేయాలని కార్యదర్శి మజ్జి శ్రీను తెలిపారు.

జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 106 వినతులు

- నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 106 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో జివిఎంసి కమిషనరు డా.పి.సంపత్ కుమార్‌తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 106 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 02, 2వ జోన్ కు 19, 3వ జోన్ కు 22, 4వ జోన్ కు 07, 5వ జోన్ కు 11, 6వ జోనుకు 09, 8వ జోన్ కు 09, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 31 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్సు విభాగమునకు 09, రెవెన్యూ విభాగమునకు 17, ప్రజారోగ్య విభాగమునకు 06, పట్టణ ప్రణాళిక విభాగమునకు 51, ఇంజనీరింగు విభాగమునకు 19, యు.సి.డి విభాగానికి 04 కలిపి మొత్తంగా 106 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనరు మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను పరిష్కరించాలని జివిఎంసి అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద రాజు, ప్రధాన వైద్యాధికారి డా.నరేష్ కుమార్, సిపి మీనా కుమారి, ఎసిపి హరిదాస్, డిసి(రెవెన్యూ) శ్రీనివాసరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి, ఎఫ్.ఎ ఎ.ఓ మల్లికాంబ, డిడిహెచ్ ఎం.దామోదరరావు, పర్యవేక్షక ఇంజనీర్లు గోవింద రావు, పివివి సత్యనారాయణ రాజు, శాంసన్ రాజు, రామమోహనరావు, యుసిడి-పిఓ డి.లక్ష్మి, డిపిఒ ఎం.వి.డి ఫణిరామ్, సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ ఎన్.కిషోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, బయోలజిస్ట్ సాంబమూర్తి, ఆర్.ఎఫ్.ఒ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

విధేయతకు పట్టంకట్టిన నామినేటెడ్ పదవులు

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవులు నిబద్ధత, విధేయతకు పట్టం కట్టేవిధంగా ఉన్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రకటించిన నామినేటెడ్ పదవుల పట్ల అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారని అన్నారు. పార్టీపై క్రమశిక్షణ, పనితీరు, ప్రజాసమస్యలపై స్పందించిన తీరు, పార్టీ అభివృద్ధికై చేసిన సేవలు, నిబద్ధతకు పట్టంకట్టేవిధంగా ఉన్నాయనడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ, అందరిని కలుపుకొని వెళ్ళేవిధంగా ఉందని అన్నారు. మొత్తం ప్రకటించిన నామినేటెడ్ పదవులో కేబినెట్ హోదా ఇద్దరికి దక్కిందని అన్నారు. ఎంతో ముందుచూపుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన చేసి ప్రకటిం చారని అన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వానికి ఇప్పుడు ప్రకటించిన వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లే పార్టీ అభివృద్ధికి బాటసారులన్నారు. నామినేటెడ్ పదవులను ప్రకటించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చరిష్మా చాలా గొప్పదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని, పేదలు కష్టాలు తీరేవిధంగా ప్రభుత్వ ఆలోచన ఉంటుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా చేసుకొని పాలన అందిస్తున్నారని, ప్రభుత్వానికి మార్గదర్శకంగా కార్పొరేషన్లు ఉంటాయని అన్నారు.

విద్యార్థులు రాణించేందుకు అపార అవకాశాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: విద్యార్థినీ విద్యార్థులు తలచుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా సరే రాణించేందుకు అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని పార్క్ హయత్ జనరల్ మేనేజర్ మార్క్ స్టైర్న జియల్ పేర్కొన్నారు. సోమవారం సన్ క్యాంపస్‌లో గ్రాండ్ హయత్, ది యూనియన్ స్టేషన్ నాష్ విల్లె సంయుక్త ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ యూఎస్‌ఏ క్యాంపస్ డ్రైవ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదిత్య రంగంలో వంట, ఆహారం, ఫ్రంట్ ఆఫీస్, హౌస్ కీపింగ్ విభాగాల్లో ఉపాధి అవకాశాల నిమిత్తం క్యాంపస్ డ్రైవ్ ను నిర్వహించడం ద్వారా మంచి అవకాశాలు లభిస్తాయి అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను వెలికి తీసి పోటీలు పడడం చూస్తుంటే తమ వృత్తిలోకి రాణించేందుకు సంకల్పించారని తెలుస్తుందన్నారు. విదేశాల్లో ఈ తరహా ఉపాధికి మంచి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. సమాజంలో గౌరవాన్ని, వ్యక్తిగత ప్రతిభకు ఉపాధి ఎంతో తోడ్పడుతుందన్నారు. పార్క్ హయత్ హెచ్ ఆర్ మేనేజర్ గిడియాన్ ప్యాకినాదన్ మాట్లాడుతూ విలువైన కెరియర్‌ను ఎంచుకునేందుకు ఇటువంటి క్యాంపస్ డ్రైవ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా జాస్తి మాట్లా దుతూ కేవలం విద్యార్థులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. సుమారు 150 మంది క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొని యుఎస్ఏలోని వివిధ ఉద్యోగాలు సాధించేందుకు తమ ప్రతిభను చాటి చెప్పారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ విద్యార్థులు

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్రస్థాయి ఘట్కా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ ఘట్కా నిర్వాహకులు రొంగలి వెంకటేశ్వరరావు, కోచ్ లెంక అప్పల రాము పేర్కొన్నారు. ఈ నెల 9, 10 తేదీలలో చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఘట్కా పోటీలలో ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ నుండి 32 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో శ్రీ వెంకట్ విద్యాపీఠ్ (సొంట్యాం) విద్యార్థులు 4 గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్, శ్రీ వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్(వేములవలస) విద్యార్థులు 3 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్,జెడ్. పి. హెచ్.స్కూల్ సొంట్యాం విద్యార్థులు 3 గోల్డ్ మెడల్స్, ఆకాష్ కాలేజీ విద్యార్థులు 2 సిల్వర్ మెడల్స్ మొత్తం 10 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయి ఘట్కా పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకట్ విద్యా పీఠ్ చైర్మన్ రొంగలి వెంకటేశ్వరరావు, ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ ఘట్కా కోచ్ లెంక అప్పల రాము, శ్రీ వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం ప్రిన్సిపాల్ ఆత్మకూరి గణేష్, జెడ్.పి. హెచ్. స్కూల్ డ్రాయింగ్ మాస్టర్ రామ్మోహన్‌రావు, శ్రీ వెంకట్ విద్యా పీఠ్ కరెస్పాండెంట్ పద్మ, ప్రిన్సిపాల్ కుమారి సత్యవేణి పాల్గొని ఎంపికైన విద్యార్థులను అభినందించారు. శ్రీ వెంకట్ విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ కుమారి సత్యవేణి మాట్లాడుతూ ఎంపికైన అభినందిస్తూ డిసెంబర్ 2 నుండి 7వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి ఘట్కా పోటీలలో పాల్గొని విజయం సాధించి మన రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇది జనరంజక బడ్జెట్ - అన్ని రంగాలకు సముచిత స్థానం

- ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజకంగా వుందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు కొనియాడారు. ఆయన సోమవారం పితాపురం కాలనీ లో గల జన శిక్షణ సంస్థాన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ తప్పిదాలు సరిచేసి విద్య, వైద్యం, జల వనరులు, తదితర రంగాలకు అధిక కేటాయింపులు చేసిన మంచి బడ్జెట్ ఇది అన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమమే ధ్యేయంగా ప్రవేశ పెట్టిన బడ్జెట్ అని ఆయన ప్రశంసించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించిన కూటమి ప్రభుత్వం మంచి బడ్జెట్ ప్రవేశ పెట్టింది అన్నారు. రైతులకు కేటాయింపులు పెంచేలా సముచిత రీతిలో నిధులు కేటాయించారన్నారు. కూటమి మూడు పార్టీల్లో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపుగా చైర్మన్ పోస్టులు వచ్చాయి అని గుర్తు చేశారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొ రేషన్‌కి కేంద్రం నిధులు ఇస్తుంది అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా వుంది ఈ బడ్జెట్ అన్నారు. సిఎం చంద్ర బాబు నాయుడు అనుభవం రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడుతుంది అన్నారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ జనరంజకంగా వుందని ఆయన ప్రశంసించారు.

తాగునీరు వృథా

పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి

వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు చేయొద్దంటూ హెచ్చరికలు

విశాలాంధ్ర - ఆనందపురం: పంచాయతీ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే పంచాయతీ ఆఫీస్‌కి నేరుగా వచ్చి తెలియపరచాలని, అంతేగాని వాట్సాప్‌లో సమాచారాన్ని ఇవ్వకూడదని బంటుపల్లి పంచాయతీ కార్యదర్శి క్రైజేస్ తెలిపారు. ప్రజా సమస్యలు ఏమైనా ఉంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పోలీసులు నేరుగా ట్విట్టర్ ద్వారా గాని ఈమెయిల్ ద్వారా గాని సందేశాన్ని పంపించమని చెబుతున్నప్పటికీ కూడా కార్యదర్శి నేరుగా ఆఫీస్‌కు వచ్చి చెప్పండి అప్పుడే సమస్యను పరిష్కారం చేస్తామని మెసేజ్‌లు చేయవద్దని అంటున్నారు. పంచాయతీలో ముఖ్య నాయకులుగా ఉంటూ మండలంలో డాక్టరేట్ పట్టా పొందిన వ్యక్తి పంచాయతీ సమస్యలపై నిత్యం పోరాడుతూ, త్రాగునీరు వృథా అవుతుండడంతో ప్రజల సమస్యపై స్థానిక కార్యదర్శి సమస్యను వాట్సప్ ద్వారా పంపించగా సదరు కార్యదర్శి నేరుగా పంచాయతీ ఆఫీస్ కొచ్చి సమస్యను వ్యక్తి చెబితే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యదర్శి సామాన్య ప్రజలు సమస్యలు పంచాయతీ సమస్యలు ఎట్లా పరిష్కరిస్తారని, ఈ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి, మండల ఎంపీడీవో జానకి దృష్టికి తీసుకెళ్తామని భీమిలి నియోజకవర్గం బీపీ కల్లాలు జనసేన నాయకులు డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు పంచాయతీ జనసైనికులు తెలిపారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె జీతాల విడుదలపై హర్షం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల 21 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన పెండింగ్ జీతాల విడుదల నిర్ణయంపై ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయ్ ఫెడరేషన్ జేఏసీ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు పెండింగ్ జీతాలపై నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సమగ్ర శిక్షా వారికి జెఏసి రాష్ట్ర కమిటీ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కాంతారావు నాని తెలిపారు. ఈ నిర్ణయం సుమారు 25,000 మంది ఉద్యోగులకు ఆర్థిక భద్రత కలిగించే చర్యగా నిలుస్తుందన్నారు. సమ్మెకాలపు నాటి ఒప్పందాలు అమలు చేయుటకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామని సమ్మె కాలపు జీతాలు చెల్లించడానికి ఉద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వ రరావు, యుటిఎఫ్, సీఐటీయూ, అన్ని ఉపాధ్యాయ సంఘాలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.